'కార్ల సరదా తీరాలంటే కాంగ్రెస్‌కు వోటు చెయ్యాలి.'

# నా కారు సరదాలు

మొదటికారులో నాతోబాటు కిరసనాలు డబ్బాలు, గోనెమూటలూ—
వెళ్లాన్ని కారెక్కించిన సుబ్బమ్మమగడంత మంచిమనిషి లేడనిపించింది—
కుచ్చులకథేనా చదవటంరాని పిచ్చిమొహాలకి కారు ఎల్లా వస్తుంది?—
కారువేపు తిరిగి తిరిగి చూస్తూనే లోపలికెళ్లా. కాని తిరిగివచ్చేటప్పటికి లేదు—

రచయిత:

## శ్రీమతి బులుసు ప్రకాశమ్మ

౧

నాకు చిన్నప్పటినుంచీ కూడా కారెక్కడమంటే వల్లమాలిన సరదా.

కారులో కూచుని కాలుమీద కాలు వేసుగుని పేపరు చదుకుంటూ వెళ్లే మగవాళ్లనూ, కిటికీల మీద మోచెయ్యానించి ముంజేతిని చెంపమీద అదో నాజూకుగా ఆనిపి ఇటు వేపువాళ్లనీ అటు వేపు వాళ్లనీ యథాలాభంగా చూచినట్టు చూస్తూ వెళ్లే ఆడవాళ్లనూ చూస్తే వీళ్లు ఎంత పుణ్యంచేసుగుపుట్టారా అనిపించేది నాకు.—

దూరాన్నించే అది లోకాలు జయించిన వీరాధివీరుడల్లే ఎవరి లక్ష్యంలేకుండా గర్జిస్తూరావడం, రోడ్లమీదవాళ్లంతా హడావిడిగా తప్పుగుని దానికి దారివ్వడం దాని ధూళుడుని అంటే అది అందరిమీదా విజృంభింపజేసే దుమ్ముసైరాలని యావన్మందీ కిక్కురుమనకుండా సహించడం చూచేసరికి అమ్మమ్మ కథలోచెప్పే, దిగ్విజయంపోం దిన రాజకుమారు డిల్లాగే వుండేవాడేమో అని అనుకునేదాన్ని.

ఆసమయాన్ని ఆకారులో కూచున్నవాళ్లు రోడ్లమీద ఈపక్కా, ఆపక్కా నడుస్తూ ఖంగారుగా తప్పుగుంటూ, దుమ్ముబాధను చేతులతో చేతనయినమట్టుగు నివారించుగుంటూ, సందులో సందు చేసుగుని తమవేపు చూసేవాళ్లకి, ఓదర్జాఅయిన చూపు విసిరేసి, ఇట్టే మాయమైపోతూంటే, మనకూడా ఈసౌభాగ్యం ఎన్నడేనా పట్టునా! అనిపించేది. పోనీ ఎవళ్ల కారేనా ఓమాటు ఎక్కి సరదా తీర్చుకుందామంటే మావూళ్లో ఎవరికీ కారులేదు. మాదో వెధవ్వూరు. ఇటు పల్లెటూరూకాదు- అటు పట్నమూకాదు- గబ్బిలాయిలాగ. ఈలాటివూళ్లో కార్లెవరికుంటాయి.

ఓనాడు నాచిన్ననాటి స్నేహితురాలు లక్ష్మి మాయింటికి వచ్చింది. మాటల్లో ఆవిడగారు తనుకారుమీద చుట్టాల ఇళ్ళకి ఏవేవోవూళ్లు వెళ్లానంటూ తెగచెప్పడం మొదలెట్టింది. పోనీ నాకారుముచ్చట కూడా అల్లాగే తీర్చుకుందామని చూస్తే మాఅత్తిల్లూ, పుట్టిల్లూ కూడా వొక్కవూరే. ఒక్కవూరే ఏమిటి! ఒక్క ఇల్లేకూడాను, మా మేనత్తకొడుక్కే నన్నిచ్చారు. వాళ్లు మొదట్నించీ మా ఇంట్లోనే ఉండడం. ఇహ వెళ్లడం ఎక్కడికి?-

ఓమాటు మా దూరబ్బంధువులొకళ్ల ఇంట్లో పెళ్ళొచ్చింది. లంఖణాలబోటెక్కితే రోజున్నరకిగాని జేరలేం అవూరు. అందుచేత కారుమీదెడదాం అన్నాడు మా మానాన్న. నాఆనందానికి హద్దులేదు. కారెక్కుతాననే సరదా నాలో పొంగి పొర్లి గట్లుతెగి ప్రవహిస్తోంది. మూటలు కట్టుకు నేటప్పుడేమిటి! రవికలు కుట్టుకునేటప్పుడేమిటి! చేతులో ఏపనిచేస్తున్నా నా మనస్సుమాత్రం కారులో కూచునేటప్పటి ఆనందమే అనుభవిస్తోంది. ఏంచీర కట్టుగోవాలో, ఏపద్ధతిగా కూచోవాలో కూడా నిర్ణయం చేసుగున్నాను. అనుకున్న రోజు వచ్చింది. కారు గుమ్మంలోకొస్తుం దిగదా సరదాగా ఎక్కవచ్చు

అనుకున్నాను. మానాన్న తొందరగా పదండి కారుమించిపోతుంది అన్నాడు - కారేదన్నాను తెల్లపోతూ.

నీమొహం కారిక్కడ కెల్లా వస్తుంది. రచ్చసావిడి దగ్గరకెళ్ళి ఎక్కాలిగాని అన్నాడు. నా సంతోషంలో సహం నీళ్లు కారిపోయింది. ఎల్లాగో కాళ్ళీడుచుగుంటూ అందరితోపాటు రచ్చసావిడి దగ్గరికి జేరాను. కారొచ్చిందిగాని, అది నేననుకున్నదానిలా లేదు. రసనాయిలు డబ్బాలూ, గోనె మూటలూ దాన్నిండావున్నాయి అసలు నాకు దాన్ని ఎక్కడానికే మనస్కరించలేదు. పోనీ కొంత కాకపోతే కొంతైనా సరదా తీరుతోందిగదా అని సమాధానపడి కారెక్కాను. తొందరగా కిటికీదగ్గర కెళ్లాను. నే అనుకునే రకంగా కూచుందామని కూచున్నాను. ఇట్టే చెయ్యిమోపుగోబోతే అక్కడనే అనుకునే పరుపుల్లేవు సరిగదా కిటికీకూడా లేదు.

ఇది నామొదటి కారు సరదా-

## ౨

ఓనాడు మాపక్కింటి సుబ్బమ్మగారి వీధులోకి అచ్చంగా నేననుకున్న కారులాంటిదే ఓకారొచ్చి ఆగింది. ఎవరో నలుగురు మంచి మంచి బట్టలు కట్టుకున్నవాళ్ళు ఆచచ్చు సుబ్బమ్మను ఎంతో ప్రత్యుద్ధానంచేసి ఆకారులో ఎక్కించుకుని తీసికెళ్ళారు. ఏమిటా! ఇదీ! అని విస్తుపోయి అల్లాగే నుంచున్నాను. ఆఖరికి యిదంతా జాతకం మహిమ అనుకున్నాను. నల్లపూస లోకి తెల్లపూసేనా లేని సుబ్బమ్మ అల్లాంటి కారెక్కిందీ అంటే అది జాతకంమహిమ కాకపోతే మరేమిటి? మర్నాడు ఆవిణ్ణి ఆరహస్యమేమిటో చెప్పి నన్ను ధన్యనుచేయమని అడిగాను. —

ఈమధ్యను వాళ్లాయన, ఓపూరిల్లోటి చవగ్గా అమ్మవస్తే, నూట యాభై రూపాయిలకు కొని, తన పేర పెట్టాడనీ, దానితో తనకు ఓవోటుకూడా వచ్చిందనీ, ఆకారు వాళ్లు ఆవోటువాళ్లేననీ, తన వోటు కోసమే వాళ్లు తనను కారెక్కించారనీ, ఆవిడ యెంతో అతిశయంతో చెప్పింది.

ఆమాట కాస్తా వినేసరికి నా నవనాళ్ళూ కుంగిపోయాయి.

ధర్మపత్ని పేర కాస్తో, కూస్తో కొని ఓటు సౌభాగ్యం కలుగజేసి కారెక్కించిన సుబ్బమ్మ మగడంత మంచిమనిషి లోకాలన్నీ వెదకినా లేడనిపించింది. మనసులోనే మాఆయన్నూ నన్నూ కలుపుగుని ఓ లక్ష తిట్టుగున్నాను.

ఓనాడు సాయంత్రం నేను చెరువునించి బిందెఎత్తుగుని వచ్చేసరికి, మాముందు వాకిట్లో చాపమీద, ఎవరో నలుగురు ఆడవాళ్లు కూచునివున్నారు. నేననుకున్నట్టే వాళ్లు మావూరువాళ్లు కారు. మావూరు వాళ్లకి ఆపాటిఅందం కూడాను! నాకు వాళ్లతో ఏం మాట్లాడాలో, ఎల్లా మాట్లాడాలో తోచలేదు. కళ్ళు అలా అప్పగించి నిలబడ్డాను.

మీవయస్సు? మీపేరు? మీయింటి నెంబరు? అంటూనే ఓ చిన్నపుస్తకంలో ఏమిటో రాశేసుగోడానికి ప్రయత్నించింది ఒకావిడ.

ఎలక్షన్లు వొస్తున్నాయి, సంతకం చెయ్యడం చేతనైనవారందరికీ ఓటివ్వడానికి అధికారంవచ్చింది. మీవోటు కాంగ్రెసుకివ్వాలి. మేం మళ్లీవస్తాం అంది రెండో ఆవిడ.

నాకళ్లఎదట సుబ్బమ్మెక్కిన కారు జిగాల్ మంది.

వాళ్లమాట కడితేరా అవకుండానే అల్లాగే యిస్తాను అన్నాను, తొందరగా, కారెక్కుతాననే సంతోషంతో! నా గొంతు గులోంచి ఓపట్టాన మాట పెగిలింది కాదు.

ఆవేళరాత్రి వంట ఏమీ చేతబడలేదు. ధ్యానంఅంతా ఆవచ్చిన ఆడవాళ్లమీదేవుంది. ఆవోట్ల పండగింకా ఎన్నాళ్ళుందో? వాళ్ళ కారు ఎల్లావుంటుందో?

కొంపతీసి ఆవేళ పెళ్లికెళ్లివలాంటి కారు తేరుగదా?

ఏంచీర కట్టుకోడం అంటూ కొంతసేపు-

ఇందాకటి ఆడాళ్ళు ఎంత నాజూకు మనుషులు. ఓట్లవాళ్లంతా యిల్లాగే వుంటారేమో! వాళ్ళు మాట్లాడుతూంటే నాగస్వరం పట్టినట్టుంది. వాళ్లందరూ కళ్లకిజోళ్ళు పెట్టుగున్నారు. కాంగ్రెసువాళ్లందరికీ చత్వారంవస్తుంది కాబోలు. అని కొంతసేపు-

ఇవే ఆలోచనలు-

నాకు గాంధీచీర లేదు. నా పెళ్ళినాడు మా అత్తవారు పెట్టినది కొల్లాన్నేటిచీర ఒకటి పెట్టిలోవుంది. పట్టుచీర కూడా గాంధిచీరల్లోనే జమ అన్నారు, ఎవరో. ఆమాట, తోచీతోచడంలో, ఏనుగు నెక్కినట్టైంది నాకు. గాంధీచీర లేని యిబ్బందితీరింది.

అనుకున్నరోజు వచ్చింది. మా యింటిముందర కారాగింది. అది అచ్చంగా నేననుకున్న కారే. నేను చీరకట్టుగుని సిద్ధంగానే వున్నాను. గబగబా వెళ్లాను కారుదగ్గరికి. మావీధివాళ్ళు చాలామంది గుమ్మాలలోనే వున్నారు. తలుపు దగ్గర నుంచుని అందరి వేపూ ఒకమాటు చూశాను.

కుచ్చుల కథేనా చదవటం రాని ఆ మొహాలు! మీ మొహాలకి కార్లు రమ్మంటే ఎల్లా వొస్తాయి అనుకున్నాను, వాళ్లని చూచి.

సీతాకోకచిలకలాంటి బట్టలు కట్టుగున్న ఓ అబ్బాయి కారు తలుపు తీశాడు. కిటికీదగ్గర నేనను కునేమో స్తరుగా కూచుందామనే ఉబలాటంతో లోపలికెళ్లాను. అప్పటికే ఎవరో ఆడాళ్ళు ముగ్గురు దాన్లో వున్నారు. వాళ్లూ నాలాంటి వాళ్లే కాబోలు కిటికీలు గట్టిగా పట్టుకు మరీ కూర్చున్నారు. నాసరదా సహాం చచ్చిపోయింది. పెట్టిన్నివారికీ పుట్టిందే సాక్షి! అనుకొని అల్లాగే వాళ్ల మధ్యనే కూచున్నాను.

బొయి, బొయి, ఘంటూ కారు బయలుదేరింది. మా వూరు వాళ్లంతా మా వేపే చూస్తున్నారు. నేనుకూడా వాళ్ల వేపు తలతిప్ప కుండానే చూశాను.

వెళ్లి, వెళ్లి, కారు ఓఇంటి ముందు ఆగింది. ఆయిల్లు ఓ పెళ్లివారి ఇల్లులావుంది. బాజాలుమాత్రం లేవు. ఇందాకటి అబ్బాయి కారు దిగమన్నాడు. నాకు దిగ బుద్ధెయ్యలేదు.

ఎంతమందో మాకు పచ్చటి శుభలేఖలు అందిచ్చారు. నామటుగు నాకు పది శుభలేఖలు ముట్టాయి. కారువేపు తిరిగి తిరిగి చూస్తూనే లోపలి కెళ్లాను.

అక్కడ వాళ్ళు చెయ్యమన్న కర్మకలాపం తొందరగా కానిచ్చుగుని ఒక వురుకున వీధిలో కొచ్చాను- కారెక్కుదామని. కారు వీధులో లేదు—గుండెలలో అయిదురోకళ్లపోటు గబగబలాడింది. ఎటుచూచినా కార్లూ, బళ్లూ దిగే వాళ్లేగాని ఎక్కేవాళ్ళు కనబడ్డం లేదు. దూరాన్ని కొందరు ఆడాళ్ళు కొంగునెత్తి మీద కప్పగుని చేతులు నుదుటికి అడ్డంగా పెట్టుగుని వెడుతూ కనపడ్డారు. విధిలేక నేను కూడా వాళ్లను అనుసరించాను.

నా రెండవకారు సరదా యీ విధంగా తీరింది.


## ఉత్తమాట కాదు !!

పట్టుమని పదిపంక్తులు వ్రాసేసరికి, ముచ్చమటలు పోసి, ముందుకు కలం నడవదు. ఇక ఇంత కాఫీయో, టీయో, పడబోస్తారు, మెదడుకు వేడెక్కి కలానికి కాస్తకదలిక వస్తుందనే ఆశతోటి. ఈలాపొదుపు చేసుకుంటూ, కాలయాపన చేసేవారనేకమంది, క్రమంగా కృశించి, కృశించి, నరాల బలహీనతతో, నిలబడడానికి కూడ, అశక్తులై, ప్రమాదస్థితిలో చిక్కుకుంటున్నారు. "అమృతప్రాశ" ఈలాటివారి పట్ల కల్పవృక్షమై, శాశ్వతమైన శక్తిని చేకూర్చి నిశితత్వంతో, కదంతొక్కిస్తుంది.

# స్వామిస్ 'అమృతప్రాశ'

అశ్వినకుమార ఫార్మసీ - నర్సాపురము